సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



వణికించిన ఈదురుగాలులు

ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ప్రజలు చిమ్మచీకట్లో రాత్రంతా గడిపారు. 8లో



చలో గుంటూరు వాయిదా

కోకో రైతులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈనెల 15న చేపట్టనున్న చలో గుంటూరు కార్యక్రమం వాయిదా వేసినట్లు కోకో రైతు సంఘం తెలిపింది. 8లో



పెట్రోల్ బంకులో మోసం

కాళ్ల హెచ్‌సీ పెట్రోలు బంకులో ఘరానా మోసం బయటపడింది. రూ.100 పెట్రోలు కొట్టిస్తే కేవలం అర లీటరు పెట్రోల్ రావడంతో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. 8లో

న్యూస్‌రీల్

తృటిలో తప్పిన ముప్పు



అడవిపాలెంలో నేలకొరిగిన ధ్వజ స్తంభం

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం ఆదివారం రాత్రి భారీ ఈదురుగాలులకు నేలకొరిగింది. ధ్వజ స్తంభం అడుగు భాగంలో చెక్క పొట్టుగా రాలడం వల్లే నేలకొరిగిందని భావిస్తున్నారు. ధ్వజ స్తంభం కూలిన శబ్దానికి స్థానికులు భయంతో పరుగులు తీశారు. ధ్వజస్తంభం పక్కనే ఉన్న రైతు భవనంపై పడడంతో ఏ ప్రమాదమూ జరగలేదు. 42 అడుగుల ధ్వజస్తంభాన్ని గ్రామస్తుల సహకారంతో నాలుగేళ్ల క్రితం ప్రతిష్ఠించారు.

నేడు ఆక్వా రైతుల సమావేశం

భీమవరం: సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం పట్టణం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం ఆక్వా రైతులు సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ సోమవారం చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాల వలన ఆక్వా రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని అన్నారు. ఆక్వా సమస్యల నుంచి ఆక్వా రైతాంగాన్ని ఏ విధంగా కాపాడుకోవచ్చో ఈ సదస్సులో వివరిస్తారని సదస్సుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.బలరాం హాజరవుతారని గోపాలన్ చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రారంభయ్యే సదస్సులో ఆక్వా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

21 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

భీమవరం: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు శ్రీవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా కల్యాణం, రథోత్సవం, వైభవోత్సవం, ఊరేగింపు, ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుక్కల బాల, జీవీఐటీ అప్పారావు, చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, పత్తి హరి వర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, ముచ్చకర్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

చివరిలో అలజడి

- జిల్లాలో మొదలైన రబీ మాసూళ్లు
- గాలివానతో బెంబేలెత్తిపోతున్న రైతులు
- మరోవైపు ఆక్వాకు వైరస్ గుబులు
- రొయ్య రైతులకు షాకిస్తున్న కరెంటు కోతలు

సాక్షి, భీమవరం: పంట చేతికందే సమయంలో వాతావరణ మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. రబీ తుది దశకు చేరుకోగా.. వరి కోతలు మొదలయ్యాయి. మరోపక్క ఆక్వా చెరువుల్లో రొయ్యలు పట్టుబడి వస్తున్నాయి. ఈ తరుణంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు వరి, రొయ్య సాగు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

జిల్లాలోని 2.30 ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేశారు. ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, తణుకు, పెనుమంట్ర తదితర ప్రాంతాల్లో వరి కోతలు మొదలవగా మిగిలిన ప్రాంతాల్లో పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 20 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. ఎరువుల ధరలు పెరిగిపోవడం, ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం రద్దు చేయడం, అన్నదాత సుఖీభవ సాయం అందించక పోవడం వంటి వాటితో కూటమి ప్రభుత్వం నుంచి సహకారం కొరవడినా రైతులు కష్టనష్టాల కోర్చి సాగు పూర్తి చేశారు. సాగు చివరి దశకు చేరడంతో పంటను గట్టెక్కించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఆందోళన కలిగిస్తున్న వాతావరణం

ఉపరితల ఆవర్తనంతో వాతావరణ మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. గత మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, ఇరగవరం, ఆచంట, పెనుగొండ, ఉండి, యలమంచిలి ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఈదురుగాలుల ప్రభావంతో వందలాది ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. ప్రస్తుతం వరి కోతల కోసం అధిక శాతం వరి కోత యంత్రాలకు మొగ్గుచూపుతున్నారు. తేమ శాతం తగ్గించేందుకు ధాన్యాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో ఆరబెడుతున్నారు. ప్రస్తుత వాతావరణానికి జడిసి కొందరు రైతులు వరి కోతలను వాయిదా వేస్తున్నారు. ఇప్పటికే కోతలు కోసిన వారు కళ్లాల్లోని ధాన్యం ఆరబెట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు. వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడే వరి కోతలు కోయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



బ్రాహ్మణచెరువు వద్ద ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు



వీరవాసరంలో నేలకొరిగిన వరిపంట

ఆక్వాకు వైరస్ గుబులు

జిల్లాలో 1.4 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా రొయ్యల సాగు విస్తీర్ణం 70 వేల ఎకరాల వరకూ ఉంటుంది. వేసవి ఉష్ణోగ్రతలు రొయ్యల సాగుకు అనుకూలంగా ఉండి ఈ సీజన్‌లో రొయ్యలు ఎక్కువగా మార్కెట్‌లోకి వస్తుంటాయి. అమెరికా ప్రతీకార సుంకాల ప్రకటనను సాకుగా చూపించి ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ ప్లాంట్ల యాజమాన్యాలు, మధ్యవర్తులు ఏకమై అమాంతం రొయ్య ధరలను తగ్గించిన విషయం విదితమే. కౌంట్‌ను బట్టి రూ.30 నుంచి రూ.70 వరకు తగ్గించి కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. సుంకాల పెంపు మూడు నెలల వరకు లేనట్టు అమెరికా ప్రకటించగా ధరలు పెరుగుతాయన్న ఆశతో రైతులు పట్టుబడులు పట్టకుండా ఎదురుచూస్తున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ఈ దశలో కొద్దిసేపు తీవ్రమైన ఎండ, ఉక్కపోత, అంతలోనే మబ్బులు కమ్ముకుని ఈదురుగాలులతో చినుకులు పడి చల్లబడుతుండం రొయ్య రైతులకు గుబులు పుట్టిస్తోంది. చలిగాలులతో వైరస్ బెడద వెంటాడుతుండగా, ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోతున్నాయని రైతులు అంటున్నారు. వాతావరణ పరిస్థితులకు జడిసి పగలూ, రాత్రి చెరువుల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలు తగ్గకుండా నిరంతరం ఏరియేటర్లు తిప్పడం, వైరస్ ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పరుగులు పెడుతున్నాం



మా ప్రాంతంలో ఇప్పుడిప్పుడే వరికోతలు ముమ్మరమవుతున్నాయి. నాలుగు రోజులుగా వాతావరణం చాలా భయపెడుతోంది. ఒక్కసారిగా మబ్బులు కుమ్ముకుని ఈదురు గాలులతో వర్షం కురుస్తుండటంతో పంటను కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నాం.


– తోరం సుబ్బన్న, పడమరవిప్పర్రు, పెంటపాడు మండలం

కంటిమీద కునుకు లేదు



ఒక పక్క అమెరికా సుంకాలంటూ రేట్లు తగ్గించేస్తే ఇప్పుడేమో వాతావరణం రొయ్య రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గాలులకు చెరువుల వద్ద వైర్లు తెగిపోయి కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు.

– బొమ్మిడి కొండరాజు, ఆక్వా రైతు, తోకతిప్ప



అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఆయనతో పాటు కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి నివాళులర్పించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొని మహోన్నత దివ్య శక్తిగా ఎదిగారని కొనియాడారు. ఎస్పీ మాట్లాడుతూ అందరికీ సమాన హక్కుల ధ్యేయంతో రాజ్యాంగాన్ని రచించి దేశానికి అందించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, డీవీఎంసీ సభ్యులు చీకటమిల్లి మంగరాజు, పొన్నమండ బాలకృష్ణ, జిల్లెళ్ళ సత్య సుధామ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.రాహుల్ కుమార్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బీ.వీ.ఎస్.బి రామాంజనేయ రాజు తదితరులు పాల్గొన్నారు. అంతకముందు అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి కేంద్ర మంత్రి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

అంబేడ్కర్ మార్గంలో నడవాలి: మండలి చైర్మన్

వీరవాసరం: బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పిలుపునిచ్చారు. నందమూరి గరువులో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి అంబేడ్కర్ సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, జెడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, సర్పంచ్ మేకల వెంకట చలపతి, మెంటే పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు.



నందమూరిగరువులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

కుల అంతరాలు లేని సమాజమే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: కుల అంతరాలు లేని.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన సమాజాన్ని అంబేడ్కర్ కోరుకున్నారని, అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. అంబేడ్కర్ జయంతిని నరసాపురం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలో ముదునూరి పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అభివృద్ధి చెందిన సమాజంలో కుల అసమానతలకు చోటు ఉండకూడదని అంబేడ్కర్ ఆశించారని ముదునూరి చెప్పారు. ప్రపంచానికే ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని వరంగా ఇచ్చారని కొనియాడారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా టాక్సీస్టాండ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జీ, పార్టీ కేంద్రపాలక మండలి సభ్యుడు పీడీ రాజు, కో–ఆప్షన్ సభ్యుడు వైకేఎస్, పార్టీ నాయకులు చాగంటి సత్యనారాయణ, పప్పుల రామారావు, షేక్ బులిమస్తాన్, బర్రి శంకరం, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కామన బుజ్జి, ఉంగరాల రమేష్‌నాయుడు, ముసూడి రత్నం, రావి బ్రహ్మాజీ, కావలి నాని, యర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

పాపాలు కప్పిపుచ్చుకునేందుకు
కూటమి ప్రభుత్వం తంటాలు

- అబద్ధమంటూనే గోవుల మరణాలు అంగీకరించారు
- మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: టీటీడీ గోశాలలోని గోవులు మరణిస్తే.. అబద్ధమంటూనే చివరకు మరణాలను అంగీకరించారని తమ పాపాలు కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వం తంటాలు పడుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. టీటీడీ చైర్మన్ గోవుల మృతి పట్ల అవాస్తవాలు చెప్పడం ద్వారా భక్తుల మనోభావాలు దెబ్బ తీశారన్నారు. దేవస్థానం ఈఓ శ్యామలరావు తన బాధ్యతలను పక్కనబెట్టి టీడీపీ సభ్యుడిగా ఆ పార్టీ అజెండా మోస్తున్నట్లు ఉందని విమర్శించారు. గోశాలలో గోవుల మృతిపై 22 గోవులు అని ఒకసారి, 40 గోవులు అని మరోసారి చెప్పారని.. చివరకు ఆలయ ఈఓ 43 గోవులు మృతి చెందాయని చెప్పారన్నారు. గోవులు మృతి చెందితే ఆందోళన ఎందుకని దేవస్థానం నిర్వాహకులు వ్యాఖ్యానించడం శ్రీవారి సేవల పట్ల వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. శ్రీవారి పవిత్ర ప్రసాదమైన లడ్డూలో జంతు కొవ్వు అవశేషాలు కలుస్తున్నాయని ఆరోపణలు చేస్తూ భక్తులను మనోవేదనకు గురి చేస్తే సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని, అయినా చంద్రబాబుకు బుద్ధి రాలేదని విమర్శించారు. టీడీపీ హయాంలో జరిగిన అవకతవకలు వైఎస్సార్‌సీపీకి ముడిపెడుతూ వైఎస్ జగన్‌మోహనరెడ్డిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబుకు ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు ఇప్పటికీ తన మోసపూరిత నైజాన్ని విడవలేకపోతున్నాడని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా శ్రీవారి నవనీత సేవకు 40 గిరి ఆవులతో కలిపి 550 గోవులను కొనుగోలు చేసి వెన్న నైవేద్యానికి ఏర్పాటు చేశామని కొట్టు సత్యనారాయణ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

వర్జీనియా రైతుకు నిరాశే!

- ఆశాజనకంగా లేని పంట ధరలు
- కిలో సరాసరి ధర రూ.278
- రూ.300 వస్తే గానీ గిట్టుబాటు కాదంటున్న రైతులు
- అమ్మకాలకు ఆసక్తి చూపని రైతులు
- బోర్డు అధికారులు ఆదుకోవాలని విజ్ఞప్తి

బుట్టాయగూడెం: ఎన్నో ఆశలతో పొగాకు పంట వేసిన రైతుకు ఈ ఏడాది నిరాశ తప్పేలా లేదు. గత రెండేళ్లుగా పొగాకు పంటకు రికార్డు స్థాయిలో ధర రావడంతో ఈ ఏడాది రైతులు భూమి కౌలు, పెట్టుబడిని సైతం లెక్క చేయకుండా పంట వేశారు. గత నెల 24న ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లు మొదటి రోజే ధర రైతులను నిరాశ పరిచింది. కిలో పొగాకుకు సరాసరి రూ.300 వస్తుందని రైతులు ఆశపడ్డారు. అయితే రూ.290 పలుకడంతో రైతులు డీలా పడిపోయారు. పొగాకు కొనుగోళ్ల ప్రారంభమై 20 రోజులు దాటినప్పటికీ ధరలో మార్పు లేకుండా మార్కెట్ ధర నిలకడగా ఉండడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ప్రసుత్తం పొగాకుకు సరాసరి ధర రూ.278 రాగా కనిష్ట ధర రూ.265 పలికింది. గరిష్ట ధర రూ.290 పలుకుతోంది. ధరలు ఇలా కొనసాగితే తీవ్ర నష్టాల పాలవుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



70 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా

రాజమండ్రి పొగాకు బోర్డు రీజియన్ పరిధిలో ఈ ఏడాది సీజన్‌లో సుమారు 70 మిలియన్‌ల కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుందని బోర్డు అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, కొనుగోలుదారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పొగాకు ఆశాజనకంగా ఉన్నప్పటికీ వాతావరణంలో మార్పుల కారణంగా ఆకు గుల్లబారి తూకం రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు బోర్డు సుమారు 56.88 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. గతేడాది మార్కెట్‌లో పొగాకు కిలో గరిష్ఠంగా రూ. 410 పలికింది. దీంతో అధిక సంఖ్యలో రైతులు పొగాకు సాగు చేశారు. బోర్డు అనుమతి లేకుండా సుమారు 8 వేల హెక్టర్లలో పంట సాగు చేస్తున్నట్లు సమాచారం.

అదనపు పంటతో చిక్కులు

బోర్డు అధికారులు ఇచ్చిన అనుమతి కంటే అదనంగా సాగు చేయడం వల్ల చిక్కులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లుగా పొగాకు ధరలు అధికంగా రావడంతో ఈ ఏడాది జీడిమామిడి, మామిడి, ఇతర పంటలను తొలగించి కొత్తగా రైతులు కూడా పొగాకు సాగు చేశారు. అధికంగా రూ.లక్ష వరకూ కౌలుకు తీసుకుని సారం లేని భూముల్లో పొగాకు పండించడం వల్ల లోగ్రేడ్ పొగాకుగా పండినట్లు సమాచారం.ఈ ఏడాది ఆశించిన దాని కంటే 20 శాతం అదనంగా పంట వేయడంతో ధరలు కూడా ఆశించిన స్థాయిలో రాకపోవచ్చని చెబుతున్నారు.

5 కంపెనీలు మాత్రమే కొనుగోలు

ప్రస్తుతం పొగాకు బేళ్ల కొనుగోల్లు మందకొడిగా సాగుతున్నాయి. ప్రారంభంలో కిలో గరిష్ట ధర రూ. 290, కనిష్ట ధర రూ.265, సగటు ధర రూ. 280.31 లభించింది. బేళ్ల కొనుగోళ్లలో 9 కంపెనీలు పాల్గొనాల్సి ఉండగా ప్రస్తుతం 5 కంపెనీలే పాల్గొంటున్నాయి. వీటిలో 90 శాతం ఐటీసీ మాత్రమే కొనుగోలు చేస్తోంది. ప్రస్తుతం రైతులు కూడా బేళ్లను అమ్మేందుకు ఆసక్తి చూపడం లేదు. కొనుగోళ్ల ప్రారంభానికి, చివరకు ధరల్లో వ్యత్యాసం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

బరువు 150 కేజీలు దాటకూడదు



బేళ్ల బరువు 150 కేజీలు దాటకుండా చూసుకోవాలి. గ్రేడింగ్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. హీట్, సాఫ్ట్ లేకుండా గ్రేడ్‌ల ఆధారంగా పొగాకు సిద్ధం చేసుకోవాలి. అవశేషాలు లేకుండా ఎగుమతికి ఆమోద యోగ్యంగా ఉండే పొగాకును పండించుకోవాలి.

– బి.శ్రీహరి, వేలం సూపరింటెండెంట్, జంగారెడ్డిగూడెం కేంద్రం–1

ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి



ఈ ఏడాది పంటకు పెట్టుబడులు, ఖర్చులు, కౌలు పెరిగాయి. సరాసరి రూ.300 వస్తేనే రైతుల కష్టాలు తీరతాయి. ప్రస్తుత ధరలు చూస్తే భయమేస్తుంది. ఇలానే కొనసాగితే రైతులు నష్టాల పాలవ్వడం ఖాయం.

– కలగర నాని, పొగాకు రైతు, కొమ్ముగూడెం, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

కలప స్వాధీనం


కొయ్యలగూడెం సమీపంలో స్వాధీనం చేసుకున్న కలప లారీ

కొయ్యలగూడెం: కలపను రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.దినేష్ తెలిపారు. సోమవారం తెల్లవారుజాము 2గంటల సమయంలో గోకవరం నుంచి కొయ్యలగూడెం వైపుగా మారుజాతి పుల్లను తరలిస్తున్న బొలెరో వాహనం, అదేవిధంగా తుని నుంచి కొయ్యలగూడెం వైపుగా మారుజాతి పుల్ల తరలిస్తున్న లారీని సిబ్బందితో కలిసి దాడి చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనాలను కన్నాపురం రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందన్నారు. దాడుల్లో సిబ్బంది కె.నవీన్, శ్రీకాంత్, మోషే పాల్గొన్నట్లు చెప్పారు.

16న చింతలపూడిలో జాబ్‌మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. జితేంద్ర బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 750 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ఈ జాబ్‌మేళాకు జిల్లాలోని పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హతలు ఉండి 18–30 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 96663 22032, 90008 03414, 91823 42688 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని సూచించారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

ద్వారకాతిరుమల: రైతు ఇంటి వద్ద ఉన్న తల్లి కోసం వెళుతున్న ఒక మైనర్ బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదయ్యింది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని కోడిగూడెంకు చెందిన ఒక మహిళ ఆదివారం సాయంత్రం కూలి డబ్బుల కోసం రైతు డొక్కా సుబ్బారావు ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఆకాశంలో మబ్బులు పట్టి, గాలిదుమ్ము వస్తోంది. దాంతో తన తల్లి ఇంకా ఇంటికి రాలేదని రాత్రి 7 గంటల సమయంలో బాధిత బాలిక (16 ఏళ్లు) నడుచుకుంటూ రైతు ఇంటికి వెళుతోంది. ఇది చూసిన అదే గ్రామానికి చెందిన దిర్శిపాము సుబ్బారావు (35 ఏళ్లు) బాలికను వెంబడించాడు. ఆ దారిలోని పాడుబడ్డ తాటాకింటిలోకి లాక్కెళ్లి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పింది. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుధీర్ తెలిపారు.

అకాల వర్షంతో అంతటా నష్టం

- కైకలూరులో నేలకొరిగిన 192 విద్యుత్ స్తంభాలు
- పూరి–తిరుపతి రైలుపై కూలిన వృక్షం
- పలు మండలాల్లో నేలకొరిగిన వరిచేలు


కాళ్ల: జక్కరం వద్ద రాష్ట్రీయ రహదారికి అడ్డంగా వృక్షం కూలడంతో ప్రజల అవస్థలు


నరసాపురం రూరల్ : నరసాపురం, మొగల్తూరు గ్రామాల్లో నేలనంటిన వరిచేలు

కైకలూరు: అకాల వర్షాలతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి వీచిన ఈదురుగాలులు, వర్షానికి పలుచోట్ల వరిచేలు, మామిడి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడి ప్రజలు అవస్థలు పడ్డారు. ప్రధానంగా విపరీతమైన ఈదురు గాలులు.. వడగండ్ల వర్షంతో కైకలూరు నియోజకవర్గం చిగురుటాకులా వణికిపోయింది. ఆదివారం రాత్రి నుంచి వీచిన గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడడంతో పాటు దాదాపు 192 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ప్రజలు చిమ్మచీకట్లలో బిక్కుబిక్కుమంటూ రాత్రంతా గడిపారు. ప్రధానంగా విద్యుత్‌శాఖకు భారీ నష్టం కలిగింది. ఆక్వా చెరువులపై విద్యుత్ స్తంభాలు ఎక్కువగా కూలబడ్డాయి. మండవల్లి మండలం పుట్లచెరువు వద్ద ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన టవర్ నేలకూలింది. దీంతో మరో టవర్ నుంచి విద్యుత్‌ను మళ్లించారు. కైకలూరు టౌన్, రూరల్, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో అనేక ప్రాంతాల్లో చెట్లు విద్యుత్ తీగలపై పడ్డాయి. ఎక్కువ నష్టం కలిదిండి మండలంలో జరిగింది. కైకలూరు టౌన్‌లో గాలులకు వైర్లు తెగిపడ్డాయి. అనేక దుకాణా బోర్డులు ఊడి రోడ్లపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆదివారం రాత్రి 8 గంటల నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పిల్లలు ఫ్యాన్లు తిరగక దోమలతో నరకయాతన అనుభవించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులు ఇబ్బందులు పడ్డారు. చార్జింగ్‌లు లేక సెల్‌ఫోన్లు మూగబోయాయి. విద్యుత్ సరఫరా యుద్ధప్రాతిపాదికన పునరుద్ధరిస్తున్నామని విద్యుత్‌శాఖ డీఈ రామయ్య చెప్పారు. ఇదిలా ఉండగా కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామ సమీప కొత్తమాలపల్లిలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు వీస్తున్న సమయంలో మేకా ఆదిలక్ష్మి (45) అనే మహిళ బయట వంట సామాగ్రి తీయడానికి వెళ్లగా ఆమెపై తాడిచెట్టు పడింది. కైకలూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు.

పూరి–తిరుపతి రైలుపై కూలిన వృక్షం

కైకలూరు రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి ప్రయాణికుల కోసం నిలిచిన పూరి–తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలుపైన, విద్యుత్ తీగలపై స్టేషన్‌లో భారీ వృక్షం పడింది. ఆ సమయంలో ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా లేదు. దీంతో ఏం జరుగుతుందో తెలియక ప్రయాణికులు భయపడ్డారు. కొందరు రోడ్డు మార్గాన వెళ్లిపోయారు. రైల్వే శాఖ మూడు గంటలు శ్రమించి విద్యుత్ వైర్లను పునరుద్ధరించింది. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈకారణంగా గుడివాడ–భీమవరం రూటులో రైళ్లను దారి మళ్లించారు.

నేలకూలిన వృక్షం

కాళ్ల: కాళ్ళ మండలంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీవర్షం ప్రజలను భయాందోళనకు గురిచేసింది. ఒకపక్క కోతదశకు వచ్చిన వరిచేలు నేలకొరిగి నీటమునిగాయి. మరోపక్క ఆక్వా రైతులకు కునుకు లేకుండా పోయింది. తీవ్రంగా వీచిన గాలులకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. కాళ్ళ నుంచి భీమవరం వెళ్లే దారిలో జక్కరం వద్ద తెల్లవారుజామున భారీవృక్షం రాష్ట్రీయ రహదారిపై కూలడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. సోమవారం వృక్షాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

రైతన్న బెంబేలు

గణపవరం: ఆదివారం రాత్రి ఉన్నట్టుండి వాతావరణం ఒక్కసారిగా మారి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రబీ రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే అప్పటికే పగటి పూట ఎండబెట్టిన ధాన్యాన్ని సాయంత్రం రాశులుచేసి తడవకుండా బరకాలు, టార్పాలిన్‌లు కప్పి ఉంచడంతో వర్ష ప్రభావం పెద్దగా నష్టం చేయలేదు. కొంతమేర తడిసిన ధాన్యాన్ని రైతులు సోమవారం ఉదయం నుంచి ఎండబెట్టుకున్నారు. ఇక కోతలు కోయడానికి సిద్ధమైన రైతులు ఆఘమేఘాలపై వరికోతలు పూర్తిచేసి ధాన్యం రాశులు సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. వర్షం నీరు చేలల్లో చేరడంతో రైతులు సోమవారం ఉదయం నుంచే చేలల్లో చేరిన నీటిని బయటకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు.

దెబ్బతిన్న మామిడి తోటలు

నరసాపురం రూరల్: నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని మామిడి, వరి పంటలు ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులు, అకాల వర్షంతో దెబ్బతిన్నాయి. నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండాల్లో సుమారు రెండు వేలకు పైగా ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. మొగల్తూరు, ముత్యాలపల్లి, పేరుపాలెం, మోడి, రుస్తుంబాద, సీతారామపురం, తూర్పుతాళ్లు, లక్ష్మణేశ్వరం, పసలదీవి, తదితర ప్రాంతాల్లో మామిడి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది ఆది నుంచి మామిడి రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. చెట్లు మామిడి పూత సమయంలో బాగానే ఉన్నా తేనె మంచు కురవడంతో పూచిన పూత అంతా మాడిపోయింది. దీంతో ఉన్న కొద్దిపాటి పూత, పిందెలను నిలుపుకునేందుకు ఇప్పటికే ఐదారుసార్లు వివిధ క్రిమి సంహారక మందులు పిచికారి చేయడంతో కొంతమేర కాయ నిలబడింది. అయితే ఒక్కసారిగా ఆదివారం రాత్రి కురిసిన భారీగాలులతో కూడిన వర్షానికి మామిడితో పాటు వరి చేలు కూడా నేలనంటాయి.


కైకలూరు: కైకలూరు రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి రైలుపై పడిన చెట్టు


నరసాపురం రూరల్: మొగల్తూరులో రాలిపడిన మామిడి కాయలు


కైకలూరు: ఆక్వా చెరువుపై పడిన విద్యుత్ స్తంభం


కైకలూరు: మండవల్లి మండలం పుట్టచెరువు వద్ద నేలకొరిగిన ట్రాన్స్‌కో టవర్


గణపవరం: చేనులో నీరు బయటకు తరలిస్తున్న రైతు


నరసాపురం రూరల్: ముత్యాలపల్లి-మోడి సెంటర్లో నేలకూలిన చెట్లు


గణపవరం: వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతు

21 నుంచి దివ్యాంగులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో దివ్యాంగులకు ఈనెల 21 నుంచి 23 వరకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్ వెల్లడించారు. వివిధ రకాల వైకల్యం గల కలిగిన 12 నుంచి 21 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు కోసం ప్రత్యేక ఒలింపిక్ భారత్ (ఎస్‌ఓబీ) సహకారంతో క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. క్రీడా స్ఫూర్తిని కలిగించి పోటీల్లో పాల్గొనే విధంగా దివ్యాంగుల్లో చైతన్యం కలిగించాలని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. క్రీడా పోటీలు నడక, బ్యాడ్మింటన్, సైక్లింగ్, బాల్ త్రో తదితర పోటీలు ఉంటాయని వివరించారు.

కోకో రైతుల చలో గుంటూరు వాయిదా


సమావేశంలో ఐక్యతను చాటుతున్న కోకో రైతులు

ఏలూరు (టూటౌన్): కోకో రైతులకు న్యాయం చేస్తామని ఈనెల 12వ తేదీన ఆగిరిపల్లి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఈనెల 15న (రేపటి) చేపట్టనున్న చలో గుంటూరు కార్యక్రమం వాయిదా వేసినట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ప్రకటించింది. సోమవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. కోకో గింజలు కొనుగోలు, ధర సమస్యలను ఈనెల 7వ తేదీ లోపు పరిష్కారం చేస్తామని ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. కోకో గింజల ధరల నిర్ణయ ప్రకటన చేయకపోవడంతో కంపెనీలు అతి తక్కువ ధర కొనుగోలు చేయడం వలన కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చలో గుంటూరు కార్యక్రమానికి పిలుపునిచ్చామని, అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలో కోకో రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. దీంతో ఆందోళన కార్యక్రమం వాయిదా వేశామని, హామీ అమలు చేయకపోతే మరలా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కలిపించాలని, పాత గింజలు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీల మోసాలు అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్ల వెంకట సుబ్బారావు, పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, ఉప్పల కాశీ నాయకులు పి.నరసింహారావు, వి.రాంబాబు, యలమాటి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో మోసంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు


కాళ్ళలో హెచ్‌పీ పెట్రోల్ బంకులో జరిగిన మోసంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితులు

కాళ్ల: కాళ్ళ హెచ్‌పీ పెట్రోలు బంకులో ఘరానా మోసం బయటపడింది. రూ.100 పెట్రోలు కొట్టిస్తే కేవలం అర లీటరు పెట్రోల్ రావడంపై వినియోగదారుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళితే కాళ్ళ గ్రామానికి చెందిన ఎం.సూరిబాబు బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో దారిలో ఆగిపోయింది. దీంతో దగ్గరలో ఉన్న హెచ్‌పీ బంకుకు వెళ్లి ఖాళీ వాటర్ బాటిల్‌లో రూ.100 పెట్రోలు కొట్టించాడు. తీరా చూస్తే బాటిల్‌లో అర లీటర్ పెట్రోలు రావడంతో విస్తుబోయి మెషిన్‌ని చూడగా 0.91 లీ. అని వచ్చింది. దీంతో పెట్రోల్ బంక్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిని నిలదీశాడు. అదే సమయంలో మరో వ్యక్తి వచ్చి బాటిల్‌లో పెట్రోల్ పట్టమనగా మళ్లీ అదేవిధంగా అర లీటరు మాత్రమే రావడంతో పెద్ద ఎత్తున వాహనదారులు బంకులో చేస్తున్న ఘరానా మోసంపై స్థానిక తహసీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్లలో మోసాలు జరగకుండా తూనికలు, కొలతల అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని వినియోగదారులు కోరుతున్నారు.

వివాదాస్పదంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించిన దళిత సంఘాల నాయకులు


నత్తారామేశ్వరం దళితవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం

పెనుమంట్ర: నత్తారామేశ్వరం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం వివాదస్పదంగా మారింది. ఇక్కడ పాత చిన్న విగ్రహం స్థానంలో పూర్తి విగ్రహం ఏర్పాటు చేసే విషయంలో గందరగోళం నెలకొంది. నూతన విగ్రహ ఏర్పాటుకు దళిత సంఘాల నేతలు కొన్నిరోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు అధికారులు ఎటువంటి అధికారిక ఉత్తర్వులు ఇవ్వకపోవడంపై దళితులు నిరసన తెలిపారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైటాయించి నిరసన ప్రదర్శన చేశారు. కొందరు నాయకులు ఒత్తిడిలకు తలొగ్గి అధికారులు ఉద్దేశపూర్వకంగానే విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. అనంతరం రోడ్డుపై రాకపోకలు నిలుపుదల చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పెనుమంట్ర ఎస్సై కె స్వామి జోక్యం చేసుకుని నాయకులకు నచ్చచెప్పారు. కొద్దిసేపు తర్జనభర్జనల అనంతరం ఎస్సై సమక్షంలో తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కేవీవీ సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పెనుమంట్రలోని అంబేద్కర్ సెంటర్‌లో దళిత సంఘాల నాయకులు మరోసారి నిరసనకు దిగారు. అక్కడ కూడా ఎస్సై జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో నిష్క్రమించారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వచ్చి ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించారు. కాగా దళితులు ఎట్టకేలకు తాము అనుకున్న విగ్రహం కాకుండా మరో విగ్రహాన్ని తీసుకువచ్చి పీఠంపై నెలకొల్పి ఆవిష్కరించారు.



లిఫ్ట్ ఇచ్చి దోచేస్తారు.. జాగ్రత్త

- లిఫ్ట్ ఇచ్చి దాడులకు తెగబడుతున్న దొంగలు
- 6 కేసులకు సంబంధించి ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తుతో డీఎస్పీ విశ్వనాథ్, రూరల్ సీఐ కృష్ణకుమార్ (ఫైల్)

తణుకు అర్బన్: లిఫ్ట్ ప్లీజ్ అని అడుగుతున్నారా.. ఎవరైనా లిఫ్ట్ ఇస్తానంటే ఎక్కుతున్నారా అయితే మీరు ప్రమాదంలో ఉన్నట్లే.. గురువుగారూ ఎక్కడ దింపమంటారు అంటూ ద్విచక్ర వాహనం ఆగినా.. బాబూ కొంచెం పైసెంటర్‌లో దింపుతారా అని మీరే అడిగినా మీపై దాడులు చేయడం ఆపై మీ జేబులు గుల్లయ్యే పరిస్థితులు ఉన్నాయి జాగ్రత్త.. లిఫ్ట్ ఇచ్చినవారు మంచి వారైతే క్షేమంగా ఇంటికి చేరే పరిస్థితి. లేదంటే వారి పని అంతేనన్నట్లుగా ఇటీవల చోటుచేసుకుంటున్న కొన్ని ఘటనలు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. దీంతో అపరిచిత వ్యక్తులు ఎవరైనా రోడ్డుపై ఆపి లిఫ్ట్ అడుగుతున్నా, లిఫ్ట్ ఇస్తామన్నా నమ్మలేని పరిస్థితి దాపురించింది.

నడి వయస్సు, వృద్ధులే లక్ష్యంగా..

కష్టపడలేక ఈజీ మనీకి అలవాటు పడుతున్న యువత ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నట్లుగా తెలుస్తోంది. వాహనంలో లిఫ్ట్ ఇచ్చి నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకువెళ్లి గాయపరుస్తూ భయభ్రాంతులకు గురిచేసి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, బ్యాంకు ఖాతాల్లోని నగదును సైతం దోచుకుంటున్నారు. ముఖ్యంగా నడి వయస్సు, వృద్ధులే లక్ష్యంగా ఈ దోపిడీ జరుగుతున్నట్లుగా బాధితవర్గాలు చెబుతున్నారు. అయితే సదరు దోపిడీదారులు చాలా భయానకంగా వ్యవహరిస్తున్నారని వాహనం నుంచి దించగానే మోకాళ్లపై కుర్చోపెట్టి మారణాయుధాలతో బెదిరించి లొంగని వారిపై దాడులకు పాల్పడుతున్నట్లుగా బాధితులు వాపోతున్నారు. ఇటీవల తణుకుకు చెందిన ఒక ప్రముఖ న్యాయవాది హైదరాబాద్‌కు వెళ్లి రాత్రి సమయంలో తణుకులో బస్సు దిగారు. ఇరగవరం రోడ్డులోని తన ఇంటికి వెళ్లేందుకు స్థానిక వెంకటేశ్వర థియేటర్ ప్రాంతంలో ఆటో కోసం ఎదురుచూస్తుండగా మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు తాము దింపేస్తామంటూ ఆయన్ను ఎక్కించుకుని కంపోస్టు యార్డు దగ్గరకు తీసుకువెళ్లి ఆయన దగ్గర ఉన్న రూ.1500 నగదు, సెల్‌ఫోన్ దోచేశారు. బ్యాంకులో ఉన్న రూ. 2వేలు కూడా ఫోన్‌పే ద్వారా వారు బదిలీ చేసుకుని ఫోన్‌తో ఉడాయించారు. దీంతో మరుసటి రోజున ఆ న్యాయవాది పట్టణ పోలీసులను ఆశ్రయించారు.

కేసును ఛేదించిన పోలీసులు

పైడిపర్రు కేంద్రంగా నివాసం ఉంటూ ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను తణుకు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరవాసరం మండలం నవుడూరు గ్రామానికి చెందిన యువకుడు, బుట్టాయిగూడెం మండలం రామచంద్రపురానికి చెందిన ఒక యువకుడు కలిసి పైడిపర్రులో నివాసం ఉంటూ తణుకు పరిసర ప్రాంతాల్లో ఈ తరహా చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. పైడిపర్రు పరిధిలోని వైజంక్షన్‌లో ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 2.87 లక్షలు విలువైన 41 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 స్మార్ట్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. వీరు తణుకు పట్టణ పరిధిలో 3, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3 చోరీల్లో పాల్గొన్నట్లు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. అయితే ఈ తరహా చోరీల్లో బాధితుల్లో కొందరు పోలీసులను ఆశ్రయిస్తుండగా మరి కొందరు చెప్పుకోలేక ఇంటి దారి పడుతున్నారు. పోలీసు స్టేషన్‌లకు చేరని నేరాలు పదుల సంఖ్యలో ఉన్నట్లుగా తెలుస్తోంది.

అపరిచిత వ్యక్తులను ఆశ్రయించవద్దు



ఎవరైనా రహదారుల్లో అపరిచిత వ్యక్తులు లిఫ్ట్ ఇస్తామంటే వద్దని చెప్పడమే మంచిది. లిఫ్ట్ ఇస్తానని వాహనం ఎక్కించుకుని దోపిడీ చేస్తున్న ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి. అపరిచిత వ్యక్తులను లిఫ్ట్ అడగకుండా ఉండడంతోపాటు, వాహనం ఎక్కండి లిఫ్ట్ ఇస్తానన్నా ఎక్కకుండా ఉండడమే క్షేమం. ఎవరిపైన అయినా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– ఎస్.కొండయ్య, తణుకు పట్టణ సీఐ

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పోణంగిలో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దాసరి లక్ష్మణరావు (45) వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

కుక్కునూరు: దామరచర్ల గ్రామంలో ఆదివారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన నేపథ్యంలో సోమవారం పికెట్‌ను కొనసాగించారు. కాగా గొడవలో గాయాలపాలైన బాధితుడు దుర్గయ్య బంధువుల ఫిర్యాదు మేరకు పది మందిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ద్వారకాతిరుమల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. పంగిడిగూడేనికి చెందిన గుమ్మడి మహాలక్ష్మి (80) ఈ నెల 7న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు దాటుతుండగా ద్వారకాతిరుమల నుంచి భీమడోలు వైపు వెళుతున్న బైక్ ఆమెను వేగంగా ఢీకొట్టింది. గాయపడిన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రంలో చాంబర్, లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవిలో రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకులు సౌకర్యార్థం సోమవారం స్థానిక రైల్వే స్టేషన్లో రెండో నెంబర్ ప్లాట్ ఫారంపై తాడేపల్లిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు మదన్ మోహన్ అగర్వాల్ సహకారం అందజేశారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జెడ్ఆర్‌యూసీసీ సౌత్ సెంట్రల్ రైల్వే సభ్యులు రవి అగర్వాల్‌లు మాట్లాడుతూ వేసవిలో ప్రజలు, ప్రయాణీకులు తప్పక చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టేషన్ మాస్టార్ ఎస్.వెంకటరావు, గూడ్స్ ఛీఫ్ సూపరింటెండెంట్ దానయ్య, విశ్రాంత నాయకులు భాస్కరరావు, ఛైర్మన్ భూషణం, క్లబ్ సభ్యులు చిన్నం జగదీష్, భీమవరపు మహాలక్ష్మి, గరికపాటి బాపయ్యశర్మ, పేరూరి కాశియ్య, విశ్వేశ్వరరావు, పచ్చ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



పెదపేటలో పేదలకు ఆహార పొట్లాలను అందజేస్తున్న యూత్ సభ్యులు

అత్తిలి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా అత్తిలి పెదపేట యూత్ ఆధ్వర్యంలో 200 మంది పేదలకు ఆహార పొట్లాలను అందజేసారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కొండే ప్రవీణ్‌కుమార్, పాలిమట్ల నవీన్, టి సుధీర్, వి మహేష్; ఎన్ రేవంత్, కె సునీల్, యు అఖిల్, ఎన్ ధరణి, చిన్ను తదితరులు పాల్గొన్నారు.


విశ్వాసమే సేవకునికి ఉత్తమ మార్గం



గూడెం బాగ్యలక్ష్మిపేట ఎల్ఎల్ఎం విమోచన మందిరంలో మాట్లాడుతున్న జైబాబు

పెంటపాడు: యేసయ్యపై సంపూర్ణ విశ్వాసమే సేవకునికి నిజమైన ఉత్తమ మార్గమని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యుపీఎఫ్) అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు పేర్కొన్నారు. సోమవారం గూడెం ఎల్ఎల్ఎం విమోచన మందిరంలో పెంటపాడు, గూడెం, నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు పలు మండలాలకు చెందిన యుపీఎఫ్ సంఘ దైవసేవకులతో బల్లారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సేవకులు దేశ క్షేమం కోసం, సంఘ ఐక్యత కోసం, సేవకుల రక్షణ కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం బైబాబు సేవకులకు ప్రభు సంస్కారమైన బల్లారాధన అందజేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న సేవకుల నుద్దేశించి జైబాబు మాట్లాడుతూ దేవునిపై విశ్వాసం ఉంచే ప్రతీవారు ఆధ్యాత్మిక నిత్యం జీవం పొందుతారన్నారు. సిలువ ధ్యానాలు, బల్లారాధనలో సేవకుల విందు కార్యక్రమాలు నిర్వహించారు. పలు మండలాల సేవకులు సుమారు 100 మంది హాజరయ్యారు. బిషప్ ఐజక్ ముగ్గళ్ల, డేవిడ్ లివింగ్‌స్టన్, సీహెచ్ మనష్షే. బిషప్, కె.రత్నరాజు, సిలువధారి ఎన్ అబ్రహాం, రాజబాబు, రాజ్‌కుమార్ జాన్‌బాబు, డానియేల్, జోసఫ్, మల్లిపూడి సాల్మన్, తదితర పాస్టర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగం ఆదర్శనీయం



నిట్‌లో అంబేడ్కర్ జయంతి

తాడేపల్లిగూడెం: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శనీయమని ఏపి నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర రెడ్డి అన్నారు. సోమవారం నిట్‌లో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశం గర్వించదగ్గ మహోన్నతుడు అంబేడ్కర్ అన్నారు. రాజ్యాంగ రూపశిల్పిగా, ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేడ్కర్ ఆశయాలను ప్రతీ ఒక్కరూ ఆచరించాలన్నారు. డీన్లు వి.సందీప్, కె.హిమబిందు, తదితరులు పాల్గొన్నారు. ఉద్యానవర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ అంబేడ్కర్ తాను అనుభవించిన వివక్ష, అవమానాలకు క్రుంగిపోకుండా పట్టుదలతో అత్యున్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. కార్యక్రమంలో కెటి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారతదేశానికి దేవుడని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, బండారు నాగు, చామన సూర్యచంద్రరావు, గారపాటి వీరకుమార్, అశోక్, 31వ ఇన్‌చార్జి లంకా రాజశేఖర్, సారవల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

తణుకు అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి అన్నారు. అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా సోమవారం తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ కీలకభూమిక పోషించి ప్రపంచ మేధావిగా పేరుగాంచారని అటువంటి మహనీయుడి జీవనశైలిని నిత్యం మననం చేసుకోవాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, జల్లూరి జగదీష్, ఫణీంద్రకుమార్ వీరమల్లు, షేక్ ఫహీమా, ఝాన్సీ లారెన్స్, ఎస్వీ జాకబ్‌బాబు, డీజే అమూల్యారావు, పుల్లెపు సూర్యచంద్రరావు, చింతలపూడి సూర్యనారాయణ, బిరుదుకోట చింతన్న, గంటా ప్రసాద్, కొమ్మోజు రామకృష్ణ, గారపాటి సత్యనారాయణ, వై.రామకృష్ణ, శ్రీనివాస్, షేక్ జిలాని, ఎడ్వర్డ్ పాల్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ భవనంలో అధ్యక్షులు సూరంపూడి కామేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరామ్, జూనియర్ సివిల్ జడ్జి పీవీ నాగరంజిత్ కుమార్, స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆంజనేయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కె.పద్మావతి, ఎస్సీఎస్టీబీసీ న్యాయవాదుల సంఘ అధ్యక్షులు కాకొల్లు విజయ్, ప్రధాన కార్యదర్శి ముమ్మిడివరపు ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా తణుకు ఎన్టీఆర్ పార్కు ప్రాంతంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు బీజేపీ దుష్టపరిపాలన నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, పట్టణ నాయకులు కోరాడ నాగేంద్రబాబు, కొంబత్తుల రవికుమార్, బొద్దాని మురళీకృష్ణ, నుడగల అప్పారావు, నాసరి మధు, నాసరి గోపి, రేకపల్లి భాస్కరరావు, సారిపల్లి శ్రీరామ్, గుబ్బల సావిత్రి, గిరిగి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అత్తిలిలో...

అత్తిలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకుని ఆయన బాటలో నడవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా సోమవారం అత్తిలిలో పలు ప్రాంతాలలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అత్తిలి పెదపేటలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు సబ్బితి రాజేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలనాటి చంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, ఇంజే రమేష్; ఈడూరి శ్యాంబాబు, సబ్బితి వెంకటేష్, తండా రాంబాబు, కోడెల్లి జయరాజు పాల్గొన్నారు.

పట్టణంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సోమవారం ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక పాతూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ హాల్ వద్ద సోమవారం అంబేడ్కర్ 134వ జయంతిని ముస్లింలు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద మసీద్ సెక్రటరీ మొహమ్మద్ షాజహాన్, సర్దార్ ఖాన్, గౌస్ ఖాన్, సలీం, వలి భాష, పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి

స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో డిపోలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లలర్పించారు. వివిధ యూనియన్ల నాయకులు, గ్యారేజీ ఇంచార్జి చిట్టిబాబు, శరత్‌బాబు, రాజేష్, చంద్రయ్య, కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిలు హాజరైయారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో వారి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్, గౌరవాధ్యక్షులు దాసం నాగేశ్వరరావు, కార్యదర్శి వై.వి.ఎస్.మూర్తి, కె.బాలకృష్ణ, ఎం.అర్జునరావు, కె.సూర్రెడ్డి, శేషారావు తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో..

స్థానిక శాఖా గ్రంథాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు, ఎ.జనార్ధనరావు, వి.జాన్‌బాబు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఎ.వి.లక్ష్మణరావు, కె.విద్యాధరరావు, మోహన్‌రావు, చదవరులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో....

స్థానిక సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ధనాల వెంకట్రావు, శిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, కాయల ప్రసాద్, నర్మాల నారాయణరావు, జవ్వాది శివ, బుద్దాల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో..

స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మిచే అంబేడ్కర్ చిత్రపటానికి నివాళ్లలర్పించారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో..

స్థానిక తాలూకా ఆఫీస్ సెంటర్‌లో మాల మహానాడుజాతీయ అధ్యక్షుడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలే వేసి నివాళ్లలర్పించారు. వృద్ధులకు, మహిళలకు చీరలు, స్వీట్స్ పంచారు. తహసిల్దార్ సునీల్ కుమార్, మునిసిపల్ కమీషనర్ యేసుబాబు, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ నాయకులు ఆధ్వర్యంలో..

అంబేడ్కర్ జయంతిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అడ్డాల నరసింహరావు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం అర్బన్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



అత్తిలి: పెదపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు



తణుకు అర్బన్: అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామేష్, న్యాయవాదులు



అత్తిలి బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తాడేపల్లిగూడెం(టీఓసీ): మాలమహానాడు ఆధ్వర్యంలో మహిళలకు చీరలు, స్వీట్లు పంచుతున్న మంగరాజు, వివిధ శాఖల అధికారులు

అందరి దేవుడు అంబేడ్కర్



తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం గ్రామంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు

తాడేపల్లిగూడెం రూరల్: అందరి దేవుడు అంబేడ్కర్ అని ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ పాత గొలుసు శాంతారావు, గ్రామస్తులు పాల్గొన్నారు. మాధవరంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, కవులూరి వెంకన్న, తారమట్ల శ్రీనివాస్, ప్రత్తి రఘు తదితరులు పాల్గొన్నారు. వెంకట్రావుపాలెంలో సర్పంచ్ ఎలిపే గాంధీ, ఉప్పరగూడెంలో దండే కనకబాబు, మారంపల్లిలో ఉప సర్పంచ్ సరిపల్లి చిట్టిబాబు, తోట సూర్యనారాయణ, మిద్దే కనకారావు, నిడదవోలు రాజేశ్వరి, సరిపల్లి వర్మ, రామిశెట్టి సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి అహ్మద్, కడియద్దలో నాయకులు దారపురెడ్డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాధవరంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనూ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కొమ్ముగూడెం, పట్టింపాలెం, నీలాద్రిపురం, చినతాడేపల్లి, వెంకట్రామన్నగూడెం, పెదతాడేపల్లి, అప్పారావుపేట, కృష్ణాయపాలెం, ఆరుళ్ల, కుంచనపల్లి, పడాల తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలోనూ అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వంట సిబ్బందికి, స్వీపర్లకు, స్కావెంజర్లకు దుస్తులు పంపిణీ చేశారు. పేరెంట్స్ కమిటి చైర్మన్ కొండే ప్రకాష్‌కుమార్, ఉపాధ్యాయులు కృష్ణ, బలరాం, రాంబాబు, సత్తిబాబు, శ్రీనివాస్, శర్మ, మోహన్, చినబాబు, భాగ్యరాజు, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్

పెంటపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెంటపాడులో ఇండియన్ ఐకాన్ అవార్డు గ్రహీత, మానవత జిల్లా నాయకుడు తాడేపల్లి మోహనరావు ఆధ్వర్యంలో పెంటపాడు బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర విగ్రహం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇసుకపాటి మధు సూధనరావు ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం మానవత నాయకుల ఆధ్వర్యంలో డైరీని, సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాల షెడ్యూల్‌ను అవిష్కరించారు. మానవత నాయకులు తారాడి పాల్, ఏలూరి వీరాస్వామి, విప్పర్తి వినాయకుడు, పొట్ల ఆనందరావు, ఏలూరి రమేష్, ప్రభువరం, జైభీమ్ సభ్యులు పాల్గొన్నారు.

జేబీయు ఆధ్వర్యంలో

గూడెం టీచర్సు కాలనీలో మానుకొండ డల్లా ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేదలకు వస్త్రదానం చేశారు. మాల మహానాడు నాయకులు చీకటిమిల్లి మంగరాజు, ఉపాధ్యాయుడు మీసాల శామ్యూల్ రాజు తదితరులు పాల్గొన్నారు. అలంపురం జైబీమ్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద భారీ అన్న సంతర్పణ చేశారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

ఇరగవరం: మండలంలోని అన్ని గ్రామాలలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో అంబేడ్కర్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సీపీఎం నాయకులు తామరపల్లి ముసలయ్య, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

మండలంలోని తూర్పువిప్పర్రు సీపీఐ కార్యాలయం వద్ద భారత రాజ్యంగ సృష్టికర్త బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు, అడ్డాల సత్యనారాయణ, కుడిపూడి వెంకటరెడ్డి, గిద్దా సూర్యనారాయణ, గాలింకి వెంకటేశులు, నామాల వెంకటేశు,గుడిమెట్ల కోటేశ్వరరావు, కాటూరి రాముడు, తిరుమలశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు: మానవత డైరీని ఆవిష్కరిస్తున్న తాడేపల్లి మోహనరావు, తదితరులు



పెంటపాడులో పేదలకు అన్నదానం చేస్తున్న దృశ్యం



ఇరగవరం: మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ

వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



తణుకులో కరపత్రాలను ఆవిష్కరించిన సీఐ కొండయ్య, అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్



అత్తిలి అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫైర్ ఆఫీసర్, సర్పంచ్

తణుకు అర్బన్: వేసవి నేపథ్యంలో అగ్నిప్రమాదాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తణుకు పట్టణ సీఐ ఎన్.కొండయ్య అన్నారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం అగ్నిమాపక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ ప్రారంభించి మాట్లాడారు. అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తు సమయాల్లో అగ్నిమాపక సిబ్బంది చూపిస్తున్న చొరవ, సాహసోపేతంగా విధుల్లో ఉంటూ విలువైన ప్రాణాలతోపాటు ఆస్తిని కూడ కాపాడుతున్నారని అభినందించారు. అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలంతా కృషిచేయాలని పిలుపునిచ్చారు. అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ముంబాయిలో ఒక ఓడ అగ్నిప్రమాదానికి గురైన పరిస్థితుల్లో విధినిర్వహణలో ఉన్న 66 మంది సిబ్బంది అసువులు బాసిన ఘటనకు స్మారకంగా అగ్నిమాపక సేవా దినోత్సవంగా వారోత్సవాలను ప్రతి ఏడాది నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఏవో వనిమిశెట్టి కృష్ణచంద్రరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ మద్దుకూరి సూర్యప్రకాష్, పట్టణ ఎస్సై కె.ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై ఆర్.బెన్నిరాజు మాట్లాడుతూ ఈ వేసవిలో అగ్నిప్రమాదాలకు తావులేకుండా ప్రజలు అవగాహనతో ఉండాలని ఎటువంటి ప్రమాదం చోటుచేసుకున్నా వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అగ్నిమాపక కార్యాలయంలో ఉన్న సామగ్రితో పాటు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను ఆవిష్కరించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అత్తిలి ఫైర్ స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

అత్తిలి: తగిన జాగ్రత్తలను పాటించడం ద్వారా అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని అత్తిలి అగ్నిమాపక అధికారి కొవ్వాసు గంగరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం అత్తిలి అగ్నిమాపక కేంద్రంలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అగ్నిమాపక అధికారి గంగరాజు «అగ్నిసురక్షిత భారతదేశానికి ఐక్యమవ్వండి» అనే అంశంపై మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామసర్పంచ్ గంటా విజేత నాగరాజు చేతులు మీదుగా అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్నిమాపక వారోత్సవాలు పట్టణంలో అగ్నిమాపక కేంద్రాధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తారు. ముఖ్య అతిధిగా లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, అతిధిలుగా పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ మురళీకృష్ణంరాజులు హాజరయ్యారు. పట్టణంలో ర్యాలీ జరిగింది. కరపత్రాలను విడుదల చేశారు. అగ్నిమాపక పతాక ఆవిష్కరణ నిర్వహించారు. తొలుత రామారావు మాట్లాడుతూ «అగ్ని సురక్షిత భారత్‌కు ఐక్యమవ్వండి» అనే అంశంపై మాట్లాడారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. వివిధ పరికరాలను ప్రదర్శించారు. డైమండ్స్ క్లబ్ సభ్యులు కాళ్ళ గోపీకృష్ణ, ఎస్.దొరబాబు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

జార్జి రెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకుడు శంకర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పీడీఎస్‌యూ ఫౌండర్ జార్జి రెడ్డి ఆశయాల సాధనకు కృషి చేద్దామని, విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.రూప శంకర్ అన్నారు. జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభ సోమవారం స్థానిక బీసీ హాస్టల్‌లో జరిగింది. రూపశంకర్ మాట్లాడుతూ విద్యార్థినీ,విద్యార్థులు శాస్త్రీయ విద్యను అవలంబించి, అభివృద్ధి చెందాలన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చాక కుల, మతాల పేరుతో విష సంస్కృతి ప్రజలలో నింపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని, అదే విధంగా విద్యార్థులు మంచి చదువులు చదివి అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

భీమవరం: వాసవీ జాగృతి వీజేఎఫ్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా జువ్వలపాలెం రోడ్‌లోని అష్టలక్ష్మి ఆలయం ఎదురుగా వాసవీ జాగృతి క్లబ్, ఆదిత్య డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన వేసవి మజ్జిగ చలివేంద్రాన్ని క్లబ్ జోన్ చైర్మన్ ఉప్పల నర్సింహమూర్తి, నాగలక్ష్మి దంపతులు ప్రారంభించారు. అనంతరం ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు బియ్యం, గోశాలలో గోవులకు దాణా పంపిణీ, గాలి రామయ్య మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థులకు స్టీల్ కంచాలు, స్పోర్ట్స్ కిట్లు వంటివి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్రిపాటి శ్రీను, సబ్బిశెట్టి గణేష్, కోశాధికారి సంక గోపాలం, నాగ సూరీ మురళి, సమయమంతుల నాని, నూలి ప్రసాద్, మండ వెంకయ్య, వేముల శేఖర్, ఎ.కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.